
రాజపూడిలో స్వామివారి పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


ధారపల్లి జలపాతంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న యాత్రికులు


తునిలో తాండవ ఉమారామలింగేశ్వర స్వామి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


రౌతులపూడి మండలం నందనవనంలో నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హరహర మహాదేవ

• వైభవంగా మహాశివరాత్రి వేడుకలు • ఆలయాలకు పోటెత్తిన భక్తులు • మార్మోగిన శివనామస్మరణ • ఏలేరు నది, సముద్రతీరాల్లో ఉత్సాహంగా పుణ్యస్నానాలు


కిర్లంపూడి మండలం కృష్ణవరంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న పండితుడు


ఏలేశ్వరం ఏలేరు నదిలో వేలాదిగా పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


వేళంగి మల్లికార్జున లొద్దులో భక్తుల రద్దీ


గోకవరంలో గోకర్ణేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ

తుని/తునిరూరల్/ఏలేశ్వరం/జగ్గంపేట/గోకవరం/ప్రత్తిపాడు/ప్రత్తిపాడురూరల్/గండేపల్లి/అన్నవరం/కిర్లంపూడి/ రౌతులపూడి/తొండంగి/శంఖవరం: మహాశివరాత్రి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం అంగరంగవైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. సుమారు 20 ఏళ్ల తరువాత శనిత్రయోదశి (శనివారం), మాస శివరాత్రి, మహా శివరాత్రి ఒకే రోజు రావడంతో ఆలయాల వద్ద ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనం కనిపించారు. ఏలేశ్వరంలోని ఏలేరు కాలువ, తునిలో తాండవ నది, తొండంగి మండలంలోని సముద్రతీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, పులిహోర, మజ్జిగ, పిల్లలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. తుని పట్టణంలోని కత్రాళ్లకొండ తాండవ ఉమారామలింగేశ్వర స్వామి ఆయాలనికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పరమశివుని దర్శనం కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన క్షేత్రంలో తెల్లవారుజాము నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రత్తిపాడు – లంపకలోవ రహదారిలో పుష్కర కాలువలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్తిపాడు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణాలయంలో బ్రహ్మకుమారీలు మహా శివలింగాన్ని ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు మహా శివలింగాన్ని దర్శించుకున్నారు. గోకవరంలో రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి, ప్రధానరహదారి పక్కన ఉన్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, కొత్తపల్లిలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉన్న రెడ్డిరాజుల కాలం నాటి బాలత్రిపుర సుందరీ దేవి సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిక్కిరిశాయి. పలు ఆలయాల వద్ద రాత్రికి పార్వతి పరమేశ్వరులకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. గండేపల్లి మండలం తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కిర్లంపూడి మండలంలోని కృష్ణవరం విశ్వనాథేశ్వర స్వామి, వేలంక ఉమానీలకంఠేశ్వరస్వామి, గోనేడ సంకల్ప సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తామరాడ దశాంజనేయస్వామి, వేలంక శివాలయం వద్ద భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. రౌతులపూడి మండలంలోని నందనవనంలో నాగలింగేశ్వరస్వామి, గంగవరం మల్లికార్జునిలొద్దులో వెలసిన దుర్గామల్లేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఏలేరులో పుణ్యస్నానాలు

ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. శివాలయం సమీపంలో ఉన్న ఏలేరు నదిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఏలేరు నది సమీపంలోని బ్రహ్మణరేవు ఒడ్డున, శశ్మాన వాటిక వద్ద ఉన్న శివుని విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఏలేశ్వరం పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, పులిహోర, ప్రసాదం పంపిణీ చేశారు.

తీరంలో సందడి

తొండంగి మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, పెరుమాళ్లపురం, వాకదారిపేట, కొత్తచోడిపల్లిపేట సముద్రతీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి తీరంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పైడికొండ గౌరీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం, సప్తనదీ జలాభిషేకం నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్వామివారికి అభిషేకం చేసిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట మండలం రాజపూడి రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శివరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. తొలుత 108 మంది కన్యలు, మరో 300 మంది మహిళలు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయానికి చేరుకుని ఆ జలాలతో స్వామివారికి అభిషేకం చేశారు. వీరభద్రస్వామి ఊరేగింపులో ఎమ్యేల్యే చంటిబాబు పాల్గొని స్వామివారి పల్లకీ మోశారు.

రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో..

రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. సత్యదేవుని ప్రధానాలయంలో స్వామివారి పక్కనే లింగాకారంలో కొలువైన ఈశ్వరునికి తెల్లవారుజామున పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష చామంతి పూజ చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు.

జలపాతాలకు పోటెత్తిన యాత్రికులు

ప్రత్తిపాడు మండలంలోని ధారపల్లి, తోటపల్లి, యరకంపాలెం జలపాతాలకు యాత్రికులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు జలపాతాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి మల్లికార్జునస్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో జలపాతాల వద్ద అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. అలాగే రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శంఖవరం మండలంలోని గిరిజన ప్రాంతమైన వేళంగి లొద్దులోని ధార క్షేత్రంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ధారమల్లికార్జున స్వామికి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్షేత్రంలో రద్దీ నెలకొంది.


కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి


ఏలేశ్వరం శివాలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు


రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


దానవాయిపేట సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం


శంఖవరం మండలం వేళంగి ధార క్షేత్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ


రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, వేలాది మంది భక్తుల నడుమ ఆలయ ప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు చిట్టి శివ ఘనపాఠి, అర్చకుడు సుధీర్, సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 20న ఏలేశ్వరం ఏపీఎస్ ఆర్టీసీ యాజమాన్యం దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లను జారీ చేస్తారని గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి తెలిపారు. బస్ పాస్‌లు కావలసిన దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో పాటు ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, బస్‌పాస్ రుసుము రూ.100 తీసుకుని రావాలన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి ఏలేశ్వరం ఆర్టీసీ బస్ డిపో సిబ్బంది మూడు సంవత్సరాల కాల పరిమితితో ఉచిత బస్ పాస్‌లను పంపిణీ చేస్తారని చెప్పారు. కాగా దివ్యాంగులు చెల్లించాల్సిన రూ.100 రుసుమును ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ చెల్లించే ఏర్పాటు చేసిందని ఆమె తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయలక్ష్మి కోరారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక పోటీలకు ప్రాజెక్టు ఎంపిక


ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి సూర్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీ

గోకవరం: మండలంలోని మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ శనివారం తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాజమహేంద్రవరం శ్రీసత్యసాయి గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో మల్లవరం హైస్కూల్ విద్యార్థి ఆర్.సూర్యనారాయణ సైన్స్ ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీ పర్యవేక్షణలో రూపొందించిన ఇకో ఫ్రెండ్లీ కాస్ట్ మంకీ స్కేరర్ డివైజ్ (ప్రాజెక్టు)రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అలాగే ఈ ప్రదర్శనలో సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీ సైతం జిల్లా ఉత్తమ సైన్స్ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థితో పాటు సైన్స్ ఉపాధ్యాయురాలు ఝాన్సీని హెచ్‌ఎం, ఎంఈఓ బి.గౌరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

తప్పిన పెనుప్రమాదం


కత్తిపూడిలో క్వారీ లారీ నుంచి రోడ్డుపై పడిన బండరాళ్లు

శంఖవరం: రౌతులపూడి మండలం నుంచి కాకినాడకు నల్లరాయి (క్వారీ రాయి) లోడుతో వెళ్లతున్న లారీ శనివారం కత్తిపూడి నంది సెంటర్ సమీపంలో అదుపు తప్పింది. స్పీడు బ్రేకర్ ఎక్కే సమయంలో లారీ డోర్ వెనుక భాగం నుంచి పెద్ద పెద్ద బండరాళ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఆ సమయంలో లారీ వెనక వాహనాలు, ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా రాళ్లు ఉండడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై రాళ్లను జేసీబీతో పక్కకు నెట్టవేశారు. నిత్యం ఈ రోడ్డులో అధిక లోడుతో మితిమీరిన వేగంతో లారీలు వెళుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఎండుగడ్డికి భలే గిరాకీ


కోటనందూరు నుంచి ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఎండుగడ్డి

కోటనందూరు: వ్యవసాయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిన తరువాత వరి ఎండుగడ్డికి మంచి డిమాండు ఏర్పడింది. వరి పంటను మెషీన్‌తో కోస్తే పశువులు తినిడానికి అనువైన ఎండుగడ్డి వచ్చే పరిస్థితి ఉండదు. మెట్ట ప్రాంతంలో అవసరం మేరకు కూలీలు అందుబాటులో ఉండడంతో వరిని యంత్రాలతో కోసే పరిస్థితి లేదు. దీంతో ఈ ప్రాంతంలో ఎండుగడ్డి రైతుల అవసరానికి మించి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఏటా జనవరి నుంచి ఏప్రిల్ వరకూ వరికుప్పలు నూర్పిడి చేయడం పరిపాటి. ప్రస్తుతం కోనసీమతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి గడ్డిని కొనుగోలు చేసి ఆయా ప్రాంతాలకు ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల నుంచి దూరాన్ని బట్టి రూ.20 వేల వరకూ పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. అవసరానికి మించి గడ్డి ఉన్న రైతులు భారీ ధరలకు విక్రయిస్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని ప్రైవేటు పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని మానవ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ లీగల్ కార్యదర్శి పిల్లి బలరాముడు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకూ ప్రైవేటు పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ, గ్రామాల అభివృద్ధి, సంక్షేమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పరిశ్రమల నిర్మాణానికి భూములిచ్చిన రైతులు కూలీలుగా పనిచేస్తున్నారే తప్పా గౌరవప్రదమైన ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వవలసి ఉండగా రోజు వారీ లేబర్ పనులు కూడా కల్పించడం లేదని ఆయన ఆరోపించారు. మైనింగ్, పరిశ్రమల నుంచి వచ్చే అభివృద్ధి నిధుల ఊసే లేదన్నారు. ఇకపై పరిశ్రమలల్లో స్థానిక అర్హత ఉన్న యువతకు గౌరవప్రదమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


లచ్చిరెడ్డిపాలెంలో లబ్ధిదారులకు రుణ చెక్కును అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

రౌతులపూడి: మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ తుని ఏడీబీ బ్రాంచి రీజినల్ మేనెజర్ సురేష్‌బాబు సూచించారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో మహిళ సంఘాల సభ్యులు, రైతులకు శనివారం రూ.1.5 కోట్లు రుణాలు అందించారు. లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించి తిరిగి రుణాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సత్యకిషోర్, సీఎస్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


కొండవారిపేటలో బాధితులకు నిత్యావసరాలు అందించిన చేయూత ఫౌండేషన్ సభ్యులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కొండవారిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు కాకినాడకు చెందిన చేయూత ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. బాధితులకు నిత్యావసరాలు, బియ్యం, కిరణా సరకులు, రగ్గులు, చాపలు, దుప్పట్లు, దుస్తులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సంస్థలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ సభ్యులు ఆనంద్, కొల్లా చిన్న, పెదపాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


కృష్ణాపురం-హంసవరం రహదారిలో వాలిన విద్యుత్ స్తంభాలు

తొండంగి: మండలంలోని కృష్ణాపురం శివారులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. కృష్ణాపురం-హంసవరం రహదారిలో వేసిన అగ్రికల్చర్ లైన్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాలు ఇటీవల వీచిన గాలులకు పూర్తిగా ఒకపక్కకు వాలిపోయాయి. పలు చోట్ల వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, పశువులు విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వాలిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


చింతలూరులో అగ్నికి ఆహుతైన ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే..చింతలూరులోని బొండు అప్పలకొండ, దుమ్ముల సుశీలకు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో విలువైన గృహోపకరణాలు, రూ.50 వేలు నగదు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో దాసు సంఘటన స్థలాన్ని పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డు సతీష్, గుర్రాల నూకరాజు, లోడ గుర్రాజు, మాస చైతన్య సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

వీనుల విందుగా గాన గంధర్వుల స్వరాభిషేకం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సీతారామరాజు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గాన గంధర్వుల స్వరాభిషేకం సంగీత విభావరి అలరించింది. ఘంటసాల శతజయంతి వేడుకలలో భాగంగా శనివారం సాయంత్రం ఏర్పాటు కార్యక్రమంలో ముందుగా ఇటీవల మృతి చెందిన సినీ నటులు కృష్ణంరాజు, కృష్ణ, కె.విశ్వనాథ్, కైకాల సత్యనారాయణ, జమున, గాయకురాలు వాణీ జయరామ్, కళాపోషకులు బాదం మాధవరావు చిత్రపటాలకు నివాళులు అర్పించారు. టౌన్ హాల్ అధ్యక్షులు కె.భామిరెడ్డి తదితర వక్తలు స్మారక కళావేదిక, పరిషత్ కళారంగ సేవలను కొనియాడారు. అనంతరం గాయకులు బాలు, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు శ్రోతలను అలరించాయి. వేదిక అధ్యక్షులు కత్రి అచ్చుతరామారెడ్డి, పరిషత్ అధ్యక్షులు యువరాజు, పెద్దాడ సూర్యకుమారి, ఉద్గళ సుబ్బారావు పాల్గొన్నారు.